క్లుప్తంగా

108 అంబులెన్స్‌లో సుఖప్రసవం

ముప్పాళ్ళ: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణి 108 అంబులెన్స్‌లో పండంటి బిడ్డకు జన్మనిచ్చిన ఘటన నకరికల్లు మండల పరిధిలోని చాగల్లు గ్రామంలో శనివారం తెల్లవారు జామున జరిగింది. చాగల్లుకు చెందిన గర్భిణి అంబటి పూజితకు పురిటి నొప్పులు రావటంతో 108 కు సమాచారం అందించారు. గర్భిణిని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా.. మార్గమధ్యలోనే అంబులెన్స్‌లో సిబ్బంది సుఖ ప్రసవం చేశారు. రెండవ కాన్పుగా పాపకు జన్మనిచ్చింది. ఈఎంటీ సీహెచ్ విజయ్‌కుమార్, పైలట్ బి.సుధాకర రావు వైద్యసేవలందించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

సత్తెనపల్లి: విద్యార్థినులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పట్టణానికి చెందిన న్యూ ఎలైట్ క్లినిక్ వైద్యురాలు అమర దీప్తి ప్రవళిక సూచించారు. పట్టణంలోని వృందా మహిళా జూనియర్ కళాశాలలో డైరెక్టర్ గంగారపు అనూష ఆధ్వర్యంలో ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను శనివారం ఆమె వివరించారు. ప్రస్తుతం కళ్ల కలక వ్యాప్తి ఉన్నందున, భయపడాల్సిన అవసరం లేదన్నారు. రెండు రోజుల్లో తగ్గిపోతుందన్నారు.

ఘనంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్

క్రోసూరు: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకలు ప్రతి గ్రామ పంచాయతీలో నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని ఎంపీడీవో బి. మహేష్ శనివారం తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ శాఖ సిబ్బంది తో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తిచేసుకున్నందున పంచాయతీరాజ్ శాఖ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో ఆజాదీకా అమృత్‌మహోత్సవ్ వేడుకలు ఈ నెల 9 నుంచి 15 వరకు నిర్వహించాలన్నారు. అధికారులు ఈ వేడుకలు నిర్వహించేందుకు తగు విధంగా ఏర్పాట్లు చేయాలని కోరారు. ఎంపీపీ పి.కోటయ్య పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

అమరావతి: అమరావతి – బెల్లంకొండ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. శనివారం అమరావతి – బెల్లంకొండ రోడ్డు పనులను మునగోడు వద్ద ఆయన పరిశీలించారు. సుమారు 47 కిలోమీటర్ల మేర రూ.149కోట్ల నిధులతో 10 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ రోడ్డులో ఉండే గ్రామాల పరిధిలో సుమారు 7 కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్డు నిర్మాణం చేస్తున్నామన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

అమరావతి: మండల పరిదధిలోని ధరణికోట కోళ్లఫారాలకు తరలిస్తున్న 24 బస్తాల రేషన్ బియ్యాన్ని శనివారం వేకువజామున విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు దాడిచేసి స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావుకు అందిన సమాచారం మేరకు రేషన్ బియ్యాన్ని ఆటోల ద్వారా ధరణి కోటలోని కోళ్ల ఫారానికి అక్రమంగా తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. 19 తెల్లని ప్లాస్టిక్ సంచులలో 24 బస్తాల రేషన్‌బియాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆటో డ్రైవర్, యజమాని, ఫారం గుమాస్తా, యజమానిపై 6ఏ సెక్షన్‌తో పాటు, క్రిమినల్ కేసు నమోదు చేయాల్సిందిగా.. స్థానిక పౌర సరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్ గఫూర్‌ను విజిలెన్స్ అధికారులకు సూచించారు. ఇన్‌స్పెక్టర్ ఎ. శ్రీహరిరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణతో.. ఆరోగ్యమస్తు

సత్తెనపల్లి: వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణతోనే గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్ అన్నారు. పట్టణంలోని 27వ వార్డు పెద్ద మసీదు వీధిలోని 1, 2 అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార కిట్లను శనివారం ఆయన పంపిణీ చేశారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారం, ఇతర సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీ కె.అన్నమ్మ, శివనాగ మల్లేశ్వరి, ఆషా, జ్యోతి, మౌలాబి, నజ్మా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లోని గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదేశించారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన సత్తెనపల్లి మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశంలో ఆయన ఎక్స్ అఫిషియో హోదాలో హాజరై మాట్లాడారు. సమావేశానికి ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జైబూన్‌బి అధ్యక్ష వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను, సదుపాయాలను చేకూర్చేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. పౌరసేవలు వేగవంతంగా ప్రజల చెంతకు చేర్చడంలో, సమస్యల పరిష్కారంలో భాగస్వాములు అయిన అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం కోసం ప్రతి గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల నిర్వహణను సక్రమంగా చూడాలని కోరారు. ఎంపీపీ జైబూన్‌బి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అన్ని సంక్షేమ కార్యక్రమాల ను సమర్థవంతంగా అధికారులు అమలు చేయాలన్నారు. ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, ఈఓపీఆర్డీ దయాసాగర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యులు కళ్ళం విజయ భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలు శాఖల మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిలర్ ప్రమీలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

వైఎస్‌ఆర్ సీపీలో చేరిన ఇండిపెండెంట్ కౌన్సిలర్

సత్తెనపల్లి : పట్టణంలోని 8వ వార్డుకు చెందిన ఇండిపెండెంట్ కౌన్సిలర్ గుజ్జర్లపూడి ప్రమీల వైఎస్‌ఆర్ సీపీలో చేరారు. సత్తెనపల్లిలోని వైఎస్‌ఆర్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పార్టీ కండువా కప్పి ఆమెను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమీల ఇండిపెండెంట్‌గా గెలిచి వైఎస్‌ఆర్ సీపీలో చేరటం అభినందనీయమన్నారు. సొంతగూటికి చేరిందని తాను భావిస్తున్నానని వివరించారు. వార్డులో నెలకున్న సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లప్పుడు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, రేపూడి రవితేజ, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు యాసారపు బాబు, సదనం హరి, జొన్నలగడ్డ ఆనంద్ పాల్గొన్నారు.

మృతులకు మంత్రి అంబటి నివాళి

సత్తెనపల్లి: పట్టణంలోని 16 వ వార్డుకు చెందిన న్యాయవాది రావెల సెలీనాలియోనిల కుమారుడు సందీప్ మృతి చెందడంతో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు శనివారం సందీప్ మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే పట్టణంలోని 15వ వార్డుకు చెందిన బొడ్డు ప్రభుదాసు భార్య పీరమ్మ మృతి చెందడంతో..ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. 16వ వార్డు ఇన్‌చార్జ్ ఆదాం, వార్డు నాయకులు చిలక రమణయ్య, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్ మంత్రి వెంట ఉన్నారు.

ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- దొడ్లేరు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



దొడ్లేరులో వృద్ధురాలికి సంక్షేమ కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహాయ సహకారాలతో పెదకూరపాడు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో నడిపించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. శనివారం మండలంలోని దొడ్లేరు గ్రామం సచివాలయం–2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. గ్రామ స్వరాజ్యం సాధన దిశలో తాము చేసిన అభివృద్ధికి దొడ్లేరు గ్రామమే నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమం, జరిగిన అభివృద్ధిని ఎమ్మెల్యే వివరించారు. సచివాలయ పరిధిలో రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని, రూ.23.74 కోట్ల సంక్షేమ సాయం అందిందని తెలిపారు. దశాబ్దాలుగా దొడ్లేరు గ్రామ అభివృద్ధిని ఎవరూ పట్టించుకోలేదని ఎమ్మెల్యే నంబూరు పేర్కొన్నారు. త్వరలోనే దొడ్లేరులో డబు లేన్ రోడ్డు, డివైడర్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. పేదల అభ్యున్నతి కోసం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, తనకు ప్రజలందరూ అండగా నిలిచి, ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ గ్రామ సర్పంచ్ ముక్కు అంజలి, వైఎస్సార్ సీపీ నాయకులు సయ్యద్ అబ్దుల్ రహీం, అవుల అంకిరెడ్డి, ఆవుల నరసింహారెడ్డి, సోము మస్తాన్‌రెడ్డి, ఎంపీటీసీ నాగయ్య, మర్రి శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ జమీలాగఫూర్, పార్టీ మండలాధ్యక్షుడు వెలది అప్పారావు, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి పాల్గొన్నారు.

ర్యాగింగ్ భూతాన్ని అంతమొందించాలి

మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి తాషీద్ హుస్సేన్



మాట్లాడుతున్న మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి తాషీద్ హుస్సేన్

సత్తెనపల్లి: ర్యాగింగ్ పెనుభూతాన్ని అంతమొందించటానికి ప్రతి విద్యార్థి నడుం బిగించాలని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి తాషీద్ హుస్సేన్ అన్నారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థాన ఆదేశాల మేరకు కంటెపూడి సమీపంలోని నలందా ఇంజినీరింగ్ కళాశాలలో సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో ర్యాగింగ్ నిరోధక చట్టం గురించి అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ముందుగా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు సభా పరిచయం చేశారు. సదస్సుకు ముఖ్య అతిథిగా జడ్జి తాషీద్ హుస్సేన్ విచ్చేశారు. ర్యాగింగ్‌కు పాల్పడితే పర్యావసానం ఎలా ఉంటుంది, శిక్షలు ఎలా ఉంటాయో వివరించారు. సత్తెనపల్లి ఏజీపీ బాలి సైద్ మాట్లాడుతూ ప్రతి కళాశాలలో విధిగా ర్యాగింగ్ చట్టానికి సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయాలని, ర్యాగింగ్ నిరోధక కమిటీ వేయాలని స్పష్టం చేశారు. సీనియర్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు సభాధ్యక్షుడిగా వ్యవహరించారు. సదస్సులో ప్యానల్ న్యాయవాది బీఎల్ లక్ష్మీకోటేశ్వరరావు, న్యాయవాది గంటా వెంకటశివ, సంఘ సేవకులు ప్రొఫెసర్ వెలుగురి సుబ్బా రాయుడు, సత్తెనపల్లి రూరల్ ఇన్‌చార్జ్ ఎస్ఐ అవుల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాం..ధైర్యంగా ఇంటింటికీ వెళ్తున్నాం..

- పెదకూరపాడులో విజయవంతంగా జగనన్న సురక్ష
- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరరావు, పక్కన నియోజకవర్గ పరిశీలకులు సోమినాయుడు

అచ్చంపేట: అర్హత ఉండి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందనట్లయితే అలాంటి వారిని గుర్తించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గంలో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా ముగిసిన సందర్భంగా స్థానిక జెడ్పీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమానికి నియోజకవర్గ పరిశీలకుడు పైలా సోమినాయుడు హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గంలో 74,562 గృహాలను సర్వే చేయగా 15,782 అభ్యర్థనలు వచ్చాయని, వాటిలో 14,471మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చినట్లు చెప్పారు. ఆ పత్రాలన్నింటిని పరిశీలించి మరో 15 రోజులులో వారి అర్హతను బట్టి సంక్షేమ పథకాలను మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు. తాము ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాం కనుకనే ప్రతి గ్రామానికి వెళ్లి, ఇంటింటికి తిరగ గలుగుతున్నామన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నేతృత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా దూసుకుపోతున్నాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు పైలా సోమినాయుడు అన్నారు. అమరావతి నుంచి బెల్లంకొండ వరకు రూ.150కోట్లతో డబుల్ రోడ్డు, మాదిపాడు వద్ద కృష్ణానదిపై రూ.60కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. క్రోసూరులో రూ.7కోట్ల వ్యయంతో పాలటెక్నిక్ కళాశాలను నిర్మించి ప్రారంభించినట్లు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమంలో ఎమ్మెల్యే శంకరరావు రాజీలేని పోరాటం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్‌యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, అచ్చంపేట, క్రోసూరు మండలాల జెడ్పీటీసీలు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, గఫూర్, అచ్చంపేట, క్రోసూరు మండలాల ఎంపీపీలు భూక్యా రజనీ కృష్ణా నాయక్, కొటయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, సర్పంచ్ కంబాల వీరబాబు, ఉప సర్పంచ్ జానీ, వైఎస్ ఎంపీపీ గంగసానిబాబు, ఎంపీటీసీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ వర్గీయులు



ఎమ్మెల్యే శంకరరావు సమక్షంలో పార్టీలో చేరుతున్న టీడీపీ వర్గీయులు

అచ్చంపేట: మండలంలోని కస్తల గ్రామం నుంచి 20 కుటుంబాలకు చెందిన తెలుగుదేశం పార్టీ వర్గీయులు శనివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని గ్రామాల నుంచి భారీగా పార్టీలో చేరికలు ప్రారంభమయ్యాయన్నారు. నాలుగేళ్లలో పార్టీలకతీతగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల లబ్ధి.. నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమచేస్తున్నట్లు గుర్తుచేశారు. అందు వల్లనే వైఎస్సార్ సీపీకి ఈ స్థాయిలో ఆదరణ లభిస్తోందన్నారు. పార్టీలో చేరిన వారిలో గుడేటి ప్రభాకర రావు, కస్తల పున్నారావు, చిలకా దావేదు, బుజ్జి, వేమవరపు వెంకట్రావు, బిక్షాలు, స్వాతి, నాగేంద్రం, పూర్ణ చంద్రరావు, నాగేంద్ర, పూర్ణయ్య, సుధారాణి, వందనమ్మ, మార్తమ్మ, భారతరాజు, పూర్ణయ్య, చెరుకూరి వెంకట్రావు తదితరులున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్ మాహబూబ్ సుభాని, చెన్నమల్లు రవి, జాన్ పీరా, మౌలాలి, సలోమాన్, విక్టర్, జిలాని, వాశిరెడ్డి వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రోసూరు, అమరావతి మండలాల నుంచి..

క్రోసూరు: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో శనివారం అమరావతి, అచ్చంపేట, క్రోసూరు మండలాల నుంచి భారీగా వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఎమ్మెల్యే ఘనంగా స్వాగతించారు. అమరావతి మండలంలోని నరుకుళ్లపాడుకు చెందిన నందిగం సురేష్, నందిగం రాధమ్మ, కంభంపాటి శ్యామ్యూల్, కంభంపాటి వెంకటేశ్వర్లు, కంబంపాటి పార్వతి, పాటిబండ్ల చిన్నమ్మాయి, కంబంపాటి సోమమ్మ, కంబంపాటి అపర్ణ చేరారు. అదేవిధంగా క్రోసూరు మండలంలోని అందుకూరు గ్రామానికి చెందిన లీలాకృష్ణ, ఎర్రబాలెం గ్రామస్తులు గంటెల శిమోను, గంటెల గోపయ్య చేరారు. వారితో పాటు అచ్చంపేట మండలం వేల్పూరు నుంచి విప్పాల సుబ్బారావు,తదితరులు చేరారు. ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, క్రోసూరు నాయకులు ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలాగఫూర్, పీఏసీఎస్ అధ్యక్షుడు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు, అనుముల కోటిరెడ్డి, టి.అప్పిరెడ్డి, డాక్టర్ షరీఫ్, అచ్చంపేట, అమరావతి నాయకులునరుకుళ్లపాడు నుంచి మహిళా నాయకురాలు పాటిబండ్ల అమృతవేణి, గ్రామ ఉప సర్పంచ్ నల్లిబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో వైద్య పరీక్షలు నిర్వహించాలి

నకరికల్లు: తక్కువ బరువు, రక్తహీనత గల పిల్లలను గుర్తించి పౌష్టికాహారం, మందులను అందివ్వాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. వైద్యశాలలోని వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలలు, హాస్టల్‌లను సందర్శించి వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. సీడీపీఓ శ్రీలత, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ వి.శ్రీనునాయక్, డాక్టర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

అచ్చంపేట: ప్రభుత్వం, సేవా సంస్థలు కల్పిస్తున్న వసతులతో మహిళలు ఆర్థికంగా ఎదగాలని జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. చెరుకుంపాలెంలో శనివారం స్నేహ హస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఫౌండేషన్ కార్యదర్శి అనుముల మురళీకృష్ణ మాట్లాడుతూ మూడు నెలలుగా చింతపల్లి, చెరుకుపాలెం, పుట్లగూడెం గ్రామాలకు చెందిన 120 మంది మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి.. 50మంది ప్రతిభావంతులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. వారందరికి సర్టిఫికెట్స్‌తో పాటు రూ.11,000 విలువ చేసే కుట్టుమిషన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. సంస్థ సలహాదారు మామిళ్లపల్లి విజయలక్ష్మి, ఎంఈవో నరసింహారావు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మా శౌర్రెడ్డి, సర్పంచ్ చింతగుంట్ల అనూరాధ, హనుమంతరెడ్డి దంపతులు, ఎంపీటీసీ సుంకర సీతమ్మ, చెన్నకేశవరెడ్డి, చింతపల్లి ఎంపీటీసీ గుర్రం కొండలు, కరిముల్లా బాబు పాల్గొన్నారు.

సార్,.. ఇవీ మా సమస్యలు

అచ్చంపేట: పటిష్టమైన మహిళా పోలీస్ చట్టం తీసుకువచ్చి, ఉద్యోగ భద్రత కల్పించాలని, తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి దృష్టికి తీసుకు వెళ్లాలని మహిళా పోలీసులు ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు శనివారం వినతి పత్రం అందజేశారు. మహిళా పోలీసులకు లైన్ డిపార్ట్‌మెంట్ లేదని, హోం డిపార్ట్‌మెంట్, మదర్ డిపార్ట్‌మెంట్ కొనసాగించాలని వారు కోరారు. ఇవేమి లేనందున తామంతా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో త్రివేద, సునీత, దుర్గాప్రసన్న, రహేలమ్మ, అరుణ, కృష్ణ, కుమారి, పార్వతి తదితరులున్నారు.

10న నులిపురుగుల నివారణ దినోత్సవం

అమరావతి: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ఈ నెల 10న నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శోభారాణి అన్నారు. శనివారం ఆమె స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఏంపీడీఓ ఉమాదేవికి నులిపురుగుల నివారణ మాత్రలు అందజేశారు. 1 నుంచి 19 సంవత్సరాలలోపు వయసున్న 14357 మంది పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. అమరావతిలో జరుగుతున్న ఫ్యామిలీడాక్టర్ కార్యక్రమానికి హాజరై రోగులను పలకరించారు. వారికి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. లింగాపురంలో టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఎంఈఓ సీహెచ్ శివబాబు, అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రవిబాబు. సీహెచ్‌వో బి.అనందరావు, ఆరోగ్య విస్తరణాధికారి షకీల్ పాల్గొన్నారు.

మణిపూర్ మహిళలపై హింసను అరికట్టాలి

సత్తెనపల్లి: మణిపూర్ లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఆపేందుకు ప్రధానమంత్రి మోదీ పూనుకోవాలని, హింసను అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని, రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్న అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ సంఘాలు శనివారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించాయి. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కోటా సాయికుమార్, ఐద్వా మహిళా సంఘం నాయకురాలు గద్దె ఉమశ్రీ, ధరణికోట విమల, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటూరు విజయ కుమార్ మాట్లాడారు. తక్షణం మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు పెండ్యాల మహేష్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్ కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు అమూల్య తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు అరికట్టాలి

నకరికల్లు: మణిపూర్‌లో అమాయక క్రైస్తవులపై జరుగుతున్న దాడులు వెంటనే నిలువరించి, నిందితులపై కఠినచర్యలు తీసుకోవాలని పలువురు పాస్టర్‌లు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మారణకాండను నిరసిస్తూ మండల సేవకుల సంక్షేమ సహవాసం ఆధ్వర్యంలో శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు కె.నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు బొక్క బాబూరావు, ఉపాధ్యక్షుడు బొంతా అబ్రహం, మేకా నాగేశ్వరరావు, పోట్లూరి కోట ఆంజనేయులు, బొక్క చిన్నగురు, జయరాజు, బొక్కా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

ముప్పాళ్ళ: పుట్టిన బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని సోషియల్ బిహేవియర్ చేంజ్ కమ్యూనికేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ కె.దస్తగిరి అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ముప్పాళ్ళలోని బీసీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మహిళా సంరక్షణ అధికారి జయలక్ష్మి, డిజిటల్ అసిస్టెంట్ యోగేశ్వరరావు, అంగన్‌వాడీకార్యకర్త వై.రాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

394 మందికి 'ఫ్యామిలీ డాక్టర్' వైద్య సేవలు

సత్తెనపల్లి: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శనివారం 394 మందికి వైద్య సేవలు అందించారు. పాకాల పాడు గ్రామంలో డాక్టర్ వి.ప్రదీప్ వైద్య పరీక్షలు నిర్వహించారు. 216 మంది ఓపీకి హాజరు కాగా వీరిలో 42 మంది జనరల్ ఓపీ, 84 మంది హైపర్ టెన్షన్, 68 మంది డయాబెటిస్, ఐదుగురు గర్భిణులు, 21 మంది బాలింతలు, 11 మంది చిన్నారులు, నలుగురు ఎనిమియా రోగులు ఉన్నారు. హెల్త్ సూపర్వైజర్ ఎ. వరలక్ష్మి, సీహెచ్‌ఓ జె.రమాదేవి, ఏఎన్‌ఎం శివపార్వతి, హెల్త్ అసిస్టెంట్ బి.కిరణ్, డీఈవో సుధాకర్, ఆశా కార్యకర్తలు జయసుధా, మహబి పాల్గొన్నారు. లక్కరాజుగార్లపాడు గ్రామంలో డాక్టర్ అనూష వైద్య పరీక్షలు నిర్వహించారు. హెల్త్ సూపర్వైజర్ జె.సంపూర్ణ దేవి, సీహెచ్‌ఓ కె.సురేష్, ఏఎన్‌ఎం పి.మరియరాణి, హెల్త్ అసిస్టెంట్ పి.నాగేశ్వరరావు, డీఈఓ జి. ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

బాలల హక్కులకు భంగం వాటిల్లితే సుమోటోగా కేసులు



మాట్లాడుతున్న బత్తుల పద్మావతి, పక్కన అధికారులు

నకరికల్లు: బాల్య వివాహాలు జరుగుతున్నట్లు కమిషన్ దృష్టికి వస్తే సంబంధిత శాఖల అధికారులందరికీ మెమోలు జారీ చేస్తామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు, జగనన్న సంపూర్ణ సురక్ష కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0–18 ఏళ్లలోపు పిల్లలందరిరి హక్కుల పరిరక్షణ కోసం కమిషన్ పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో బాలల హక్కులకు ఎక్కడ భంగం వాటిల్లినా సుమొటోగా కేసులు నమోదు చేస్తామని అన్నారు. దేశంలో జరుగుతున్న బాల్య వివాహాల్లో రాష్ట్రం 5వ స్థానంలో ఉండగా.. రాష్ట్రంలో గుంటూరు జిల్లా నాలుగో స్థానంలో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం జీఓనెం 31ని గత నెలలో జారీ చేసిందన్నారు. బాలల అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రభుత్వం కమిషన్ ద్వారా పకడ్బందీ చర్యలు తీసుకుంటుందన్నారు. సీడీపీఓ శ్రీలత, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి గర్భిణులకు, బాలింతలకు జగనన్న సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కె.నగేష్, ఈఓపీఆర్డీ గిరిధర్, డాక్టర్ నాగమణి, సూపర్‌వైజర్‌లు షేక్.రమీజున్, జె.ఆనందకుమారి, జేవీ నాగమణి, మహిళా పోలీస్ సయ్యద్ రషీదా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.